క్లుప్తంగా

జాగ్రత్తలతో అగ్నిప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న ఆర్‌ఎఫ్‌వో నిరంజన్‌రెడ్డి

అల్లిపురం: హోటళ్లలో అగ్నిప్రమాదాలు సంభవించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రీజినల్ ఫైర్ ఆఫీసర్ నిరంజన్‌రెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నగరంలో ఒక హోటల్లో నగర హోటళ్ల యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకవలు తెలియజేశారు. ప్రతి ఏడాది అగ్నిమాపక వారోత్సవాలు జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హోటళ్లు, పరిశ్రమల్లో సిబ్బందితో పాటు గృహస్తులు కూడా అగ్నిప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నగరంలో మరో నాలుగు అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరు చేసిందన్నారు. అందుకు తగిన భూమిని కలెక్టర్ కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఎఫ్‌వోలు పి.సింహాచలం, సిబ్బంది, హోటల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు అభాగ్యుడు



కుటుంబ సభ్యులకు సుధాకర్‌ను అప్పగిస్తున్న షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి

సీతమ్మధార: ఒడిశాలోని నవరంగ్‌పూర్‌కు చెందిన సుధాకర్ (45) అవివాహితుడు. తల్లిదండ్రులు చనిపోవడంతో మానసికంగా కుంగిపోయి రోడ్ల మీద తిరిగేవాడు. ఈనెల 15వ తేదీన రైల్వే పోలీసులు, ఏయూటీడీ సిబ్బంది రైల్వే స్టేషన్‌లోని 1వ నంబర్ ప్లాట్‌ఫారంపై అతన్ని గుర్తించారు. టీఎస్ఆర్ మెన్ షెల్టర్లో అతనికి ఆశ్రయం కల్పించారు. అతనికి పెదనాన్న కుమారుడు ఉన్నాడని తెలుసుకుని ఫోన్ చేసి రప్పించారు. సుధాకర్ మరోసారి రోడ్ల మీద తిరగకుండా చూసుకుంటామని వారు చెప్పడంతో అన్నయ్య కిరణ్‌కుమార్ సమక్షంలో సుధాకర్‌ని అప్పజెప్పినట్లు షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి తెలిపారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



వైభవ వేంకటేశ్వరస్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ ఈవో బి.ప్రసాద్ తెలిపారు. తెల్లవారు జామున సన్నిధిగొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. 7.30 గంటలకు బాలభోగం, 9.30లకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుంది. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా భక్తులకు అన్నసమారాధన చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు విశేష హారతి సమర్పణ జరుగుతుంది.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంఖుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, వసంతలక్ష్మి తదితరులు

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డులో రూ.1.33 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మితో కలిసి శుక్రవారం శంఖుస్థాపన చేశారు. వార్డులో ఓపెన్ జిమ్, సీసీ రోడ్లు, కాలువలు, కల్వర్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరంతరం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఆకుల రాజు, జీవీఎంసీ డీఈ వెంకటేశ్వరరావు, ఈఈ నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం జాస్తి.. నిర్వహణ నాస్తి

- పాతనగరంలో మూలకు చేరిన కల్యాణ మండపాలు
- రాబడి వస్తున్నా పట్టించుకోని జీవీఎంసీ
- మరమ్మతు చేయాలని కోరుతున్న స్థానికులు



జీవీఎంసీ 39వ వార్డులో ఉన్న గిడ్డి జగన్నాథం కల్యాణ మండపం



జీవీఎంసీ 35వ వార్డులో ఉన్న సైలాడ పైడితల్లి కల్యాణ మండపం

జగదాంబ: ప్రజల కోసం ఏర్పాటు చేసిన కమ్యూనిటీ హాళ్లు, కల్యాణ మండపాలు జీవీఎంసీకి భారీగా ఆదాయం తెచ్చిపెడుతున్నా వాటి నిర్వహణ పట్ల శ్రద్ధ చూపకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. మురికివాడల ప్రజల అవసరాలకు జీవీఎంసీ కమ్యూనిటీ భవనాలు ఏర్పాటు చేసింది. అసలే మురికివాడలు.. ఆపై ఇరుకు సందులు కావడంతో ఎక్కడ శుభకార్యం జరిగినా ఆ వీధిలో రోడ్డును ఇరువైపులా బ్లాక్ చేసి కార్యాలు చేసుకోవలసి ఉంటుంది. ఈ సమస్య పరిష్కారానికే జీవీఎంసీ ఏళ్ల కిందట కమ్యూనిటీ భవనాలు నిర్మించింది. అప్పటి నుంచి వాటిపై ఆదాయం ఆర్జిస్తున్నా వాటి నిర్వహణ పట్ల అంకితభావం కొరవడడంతో అవి కాస్త నిరుపయోగంగా మారుతున్నాయి.

శిథిలావస్థలో కోటవీధి కల్యాణ మండపం..

నగరానికి చివరన ఉన్న కోటవీధి జీవీఎంసీ 39వ వార్డు పరిధిలో ఉంది. ఇక్కడ రెండు వైపులా సముద్రం ఉంటే మరోవైపు పోర్టు ఉంది. ఈ ప్రాంతంలో ప్రజల అవసరాల కోసం ఏర్పాటు చేసిన గిడ్డి జగ్గన్నాథం కల్యాణ మండపం సంవత్సరాలుగా శిథిలమై ఉంది. ఇందులో కింద నడిచే టైల్స్ నుంచి తలుపులు, కిటికీలు అన్నీ చెదలు పట్టి మూలకు చేరుకున్నాయి. ఈ విధంగా ఉన్న కల్యాణ మండపానికి జీవీఎంసీ ఇంకా ఆదాయం ఆర్జిస్తుంది కానీ అభివృద్ధి చేయడంలేదు. ఫలితంగా స్థానికులు ఈ కల్యాణ మండపాన్ని వదిలేసి తమ ఇంటి ముందు రోడ్డు మీదే తమతమ కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారు.

సైలాడ పైడితల్లి కల్యాణ మండపం..

జీవీఎంసీ 35వ వార్డు మున్సిపల్ స్టేడియం ఎదురుగా సైలాడ పైడితల్లి కల్యాణ మండపం ఉంది. దీన్ని పేదవాళ్లకు తక్కువ అద్దెకు ఇవ్వడంతో పాటు జీవీఎంసీ కార్యక్రమాలకు కూడా ఉపయోగిస్తుంటారు. ఎప్పుడూ ఖాళీ లేకుండా ఉండే ఈ కమ్యూనిటీ హాలు ముఖద్వారం అందవికారంగా ఉంటుందంటేనే దీని నిర్వహణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కల్యాణ మండపం చుట్టు, వంట గది పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటాయి. దీని ద్వారా కూడా అధిక రాబడి వస్తున్నప్పటికీ జీవీఎంసీ అభివృద్ధి చేయడానికి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తుందో తెలియడంలేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



అపరిశుభ్రంగా ఉన్న సైలాడ పైడితల్లి కల్యాణ మండపం వంట చేసే ప్రదేశం

శ్రద్ధగా నిర్వహిస్తే బాగుంటుంది

పాతనగరంలో పేదలకు సైలాడ పైడితల్లి కల్యాణ మండపమే దిక్కు. అపరిశుభ్రంగా ఉన్నా తప్పనిసరి పరిస్థితి కనుక శుభ కార్యాలకు దీన్నే వాడుతున్నాం. దీన్ని పరిశుభ్రంగా నిర్వహిస్తే బాగుంటుంది. జీవీఎంసీ అధికారులు, కల్యాణ మండపం నిర్వాహకులు మరింత శ్రద్ధ తీసుకోవాలి. – కె. శ్రీరాములు, వన్‌టౌన్

మరమ్మతులు అవసరం

గిడ్డి జగన్నాథం కల్యాణ మండపానికి మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకు రావాలి. గతంలో జనాభా తక్కువ ఉండేవారు కనుక ఇళ్ల ముందు శుభకార్యాలు చేసుకున్నా ఇబ్బంది లేకపోయేది. ఇప్పుడలా కాదు. జీవీఎంసీ ప్రజల సౌకర్యార్థం ఈ కల్యాణ మండపానికి మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

– బి. ఈశ్వరమ్మ, కోటవీధి

పరిశీలించి చర్యలు తీసుకుంటాం



శిథిలావస్థకు చేరుకున్న కల్యాణ మండపాలను పరిశీలిస్తాం. మరమ్మతులు అవసరం అయితే ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశిస్తాం. నిర్వాహకులు కల్యాణ మండపాలను పరిశుభ్రంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం.

– ఎం. మల్లయ్యనాయుడు, జెడ్సీ, జోన్–4.

మత్స్యకార భరోసా రిజిస్ట్రేషన్ గడువు పెంచాలి



మత్స్యశాఖ జేడీ చంద్రశేఖరరెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న ఉమ్మడి మహేష్ తదితరులు

మహారాణిపేట: మత్స్యకార భరోసా రిజిస్ట్రేషన్ గడువును మరో వారం రోజులు పొడిగించాలని రాష్ట్ర మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఉమ్మడి మహేష్ కోరారు. శుక్రవారం ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యశాఖ జేడీ కార్యాలయంలో జేడీ చంద్రశేఖరరెడ్డిని కలిసి పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఏప్రిల్ 15వ తేదీన ప్రారంభించి 18 చివరి తేదీగా ప్రకటించడం చాలా బాధాకరమన్నారు. గతంలో నెల రోజుల సమయం ఇచ్చేవారని, ఈసారి కేవలం 3 రోజులు సమయం ఇవ్వడం వల్ల మత్స్యకారులకు అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. ఈ సంవత్సరం జనవరిలో ఆధార్ కార్డులు కలెక్ట్ చేశారని, మత్స్యకార భరోసా రిజిస్ట్రేషన్ కోసం పేపర్లు ఇచ్చామని తెలిపారు. కొంత మంది మత్స్యకారులు జీవనోపాధి కోసం స్వగ్రామాలకు వెళ్లారన్నారు. ప్రభుత్వం గురువారం గుడ్ ఫ్రైడే సందర్భంగా 8976 మంది పాస్టర్లకు 7 నెలల బకాయిలు ఒక్కొక్కరికీ రూ.35,000 విడుదల చేసిందని, మత్స్య కారులకు గత సంవత్సరం మత్స్యకార భరోసా రూ. 20 వేలు ఇవ్వలేదని, ఈ సంవత్సరం మరో రూ. 20 వేలతో కలిపి రూ. 40 వేలు తమ అకౌంట్‌లో జమ చేయాలని కోరారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని అధికారులను కోరారు. జేడీని కలిసిన వారిలో దేవాలయ విభాగం రాష్ట్ర కార్యదర్శి గుంటు సత్తయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు వాసుపల్లి ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

పోతుస్వామి కుటుంబానికి భరోసా



పోతుస్వామి కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం: మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పిలుపు మేరకు ఇటీవల మరణించిన 37వ వార్డు అధ్యక్షుడు నొల్లు పోతుస్వామి కుటుంబానికి నియోజకవర్గంలో వార్డు అధ్యక్షుడు అండగా నిలిచారు. శుక్రవారం ఆశీలమెట్ట దరి వాసుపల్లి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పోతుస్వామి భార్య నొల్లు యల్లయ్యమ్మ, కుమారుడు నొల్లు చంటికి రూ.40 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ అందరూ కలిసి ఉంటే ఎంత కష్టమైనా ఎదుర్కోవచ్చన్నారు. పార్టీ కష్టకాలంలో అంతా కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. తన మాట మన్నించి సాయం అందించడానికి ముందుకు వచ్చిన పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. మనతో పాటు పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసిన నొల్లు పోతుస్వామి (పోతురాజు) మృతి ఆ కుటుంబంతో పాటు, పార్టీకి కూడా తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు, ఎరిన్నమ్మ తల్లి గుడి చైర్మన్ లండ రమణ, సాంస్కృతిక విభాగం... సౌత్ కల్చరల్ వింగ్ అధ్యక్షుడు సూర్యనాయుడు, చంద్రమౌళి, అజయ్, వాసుపల్లి రాజు, రామరాజు, చింతకాలయ వాసు, వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

21న వైద్య ఆరోగ్య రంగాలపై సదస్సు



సదస్సు పోస్టర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

అల్లిపురం: ఈ నెల 21న అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో 'వైద్య, ఆరోగ్య రంగాలు, ప్రభుత్వ కాలేజీల ప్రైవేటీకరణ ప్రభావాలు' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు కేంద్రం ప్రోగ్రామ్ ఇన్‌చార్జి జీఎస్ రాజేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా మాజీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.రామారావు, ఆంధ్రా మెడికల్ కాలేజీ మాజీ గైనిక్ విభాగాధిపతి డాక్టర్ వై.ఎల్.నర్సింగరావు, యువజన విభాగం కార్యదర్శి కె.సంతోష్‌కుమార్, డాక్టర్ అన్వేష్‌తో కలిసి సెమినార్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగతులైన ప్రజావైద్యులు, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులైన డాక్టర్ కె. హరిప్రసాద్ స్మృత్యర్థం ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో ఏపీ మాజీ హెల్త్ సెక్రటరీ డాక్టర్ పీవీ రమేష్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ సత్యవరప్రసాద్ పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎంవీ రమణయ్య అధ్యక్షత వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అండ్ హెల్త్ విభాగం సిబ్బంది, మెడిసిన్, నర్సింగ్ విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

- తొమ్మిది బైకులు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాల వద్ద క్రైం ఏసీపీ లక్ష్మణరావు, సీఐ రాజులునాయుడు, ఎస్ఐ సునీల్ తదితరులు

అల్లిపురం: ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను టూటౌన్ క్రైం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి తొమ్మిది బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు టూటౌన్ క్రైం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రైం ఏసీపీ డి.లక్ష్మణరావు వివరాలు వెల్లడించారు. జనవరి 22వ తేదీ రాత్రి అల్లిపురం, యాతపేట, మసీదు సమీపంలో షేక్ రంజాన్ తన ఇంటి ముందు బండిని పార్కు చేశారు. మరుసటి రోజు ఉదయం చూసేసరికి అతని బైక్ కనిపించకుండా పోయింది. దీంతో అతను టూటౌన్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు క్రైం డీసీపీ కె. లతామాధురి పర్యవేక్షణలో క్రైం ఏడీసీపీ ఎం.మోహనరావు, ఏసీపీ డి.లక్ష్మణరావు, క్రైం సీఐ సీహెచ్ రాజులనాయుడు పర్యవేక్షణలో ఎస్ఐ ఎన్. సునీల్ తన సిబ్బందితో కలిసి దర్యాప్తు చేపట్టాడు. సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులు అంతర్రాష్ట్ర దొంగలుగా గుర్తించారు. ఒడిషా రాష్ట్రం కోరాపుట్‌కు చెందిన కార్తీక్ కిల్లో, బాబుల సుపియాలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగర పరిధిలో దొంగిలించిన మూడు రాయల్ ఇన్‌ఫీల్డ్ బైక్‌లు, యమహా ఆర్ 15 బైక్‌లు నాలుగు, కేటీఎం ఆర్‌సీ 200, యమహా ఎఫ్‌జెడ్ వంటి రూ.10 లక్షలు విలువ గల తొమ్మిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో హెచ్‌సీ హఫీజ్, కానిస్టేబుళ్లు గోవిందరావు, గణేష్, బాలాజీ, అజీజుద్దీన్ పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బుచ్చయ్య

మురళీనగర్: టెక్నాలజీ పెరుగుతున్న నేపథ్యంలో నేటి సమాజంలో పెరిగిపోతున్న సైబర్ నేరాలు, నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని వాకర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్.బుచ్చయ్య (92) కోరారు. తొమ్మిది పదుల వయసులోనూ ఆయన సామాజిక చైతన్య కార్యక్రమాల్లో పాల్గొంటూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ మేరకు ఆయన స్వయంగా శుక్రవారం సైబర్ నేరాల నిరోధంపై ప్రచారం చేశారు. వాకర్స్ పార్కులోని పలువురు వాకర్లను కలిసి సైబర్ నేరాలు జరుగుతున్న తీరు, అప్రమత్తత పట్ల వివరించారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్లకు జవాబు ఇవ్వొద్దని, మొబైళ్లలో ఎటువంటి బెట్టింగు యాప్‌లు డౌన్‌లోడ్ చేయొద్దని, వాటిని సోషల్ మీడియాలో ఇతరులకు షేర్ చేయొద్దని, లాటరీలకు సంబంధించి పాస్‌వర్డులు అడిగితే అవి మోసపూరితమైనవిగా గ్రహించాలని, 'స్క్రాచ్ చేయండి– రివార్డు పొందండి' అంటూ వచ్చే సందేశాలకు జబాబు ఇవ్వరాదని, ఏపీకే పేరుమీద వచ్చే యాప్‌లను ఓపెన్ చేయొద్దని, పెట్టుబడులు పెట్టి లాభాలు పొందండంటూ వచ్చే సందేశాలకు స్పందించరాదని వివరించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, రిటైర్డ్ ప్రొఫసర్ సబ్బినేని రామ్మోహనరావు, పాలిటెక్నిక్ కాలేజీ మైనింగ్ డిపార్టుమెంటు హెడ్ కాటమనేని వెంకటరమణ, డి.కుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



ప్రార్థనలో పాల్గొన్న జాన్‌వెస్లీ తదితరులు



ప్రార్థనా గీతాలు ఆలపిస్తున్న భక్తులు

అల్లిపురం: నియోజకవర్గంలో అల్లిపురం మెయిన్ రోడ్డు, కల్వరి బాప్టిస్ట్ చర్చి, ఆంథోనీనగర్‌లో గల సెయింట్ ఆంథోనీ చర్చి, జగదాంబ దరి లండన్ చర్చితో పాటు కొబ్బరితోట, చలువతోట ప్రాంతాల్లోని చర్చిల్లో గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కల్వరి బాప్టిస్ట్ చర్చిలో రెవరెండ్ కె. వేదమణి సిలువపై ప్రభువు పలికిన మొదటి, ఐదవ, ఏడవ మాటలను, రెవరెండ్ జి.జాన్‌పీటర్, డాక్టర్ ఎల్.కె.మృత్యుంజయ రెండు, నాలుగు, ఆరు మాటలను, రెవ ప్రిమ్‌రోజ్ రంగారావు వాసా మూడవ మాటను చదివి వినిపించారు. అంతకు ముందు చర్చి అధ్యక్షుడు రెవరెండ్ జీవీ జాన్‌పీటర్ ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు కీర్తనలు ఆలపించి డి భక్తులను అలరించారు.

మత్స్యకారుల ఎన్యూమరేషన్ పూర్తి



నిషేధ భృతి కోసం ఎన్యూమరేషన్ చేస్తున్న సిబ్బంది

మహారాణిపేట: చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే వేట నిషేధ భృతి కోసం శుక్రవారం ఎన్యుమరేషన్ పూర్తి చేశారు. జిల్లాలోనిని 15 ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల్లో మత్స్యశాఖ జేడీ ఎ.చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది, సచివాలయ ఫిషరీస్ కార్యదర్శులు, సాగర్ మిత్రాలు సర్వేలు నిర్వహించారు. ఏటా వేట నిలుపుదల చేసిన తర్వాత ఎన్యుమరేషన్ నిర్వహించడం పరిపాటి. ఇందులో భాగంగా నిర్వహించిన ఈ గణనలో అన్ని రకాలకు చెందిన మొత్తం 1,197 బోట్లను, 12వేల మంది మత్స్యకారుల వివరాలు నమోదు చేశారు. బోట్లకు, మత్స్యకారులకు ఫొటోలు తీశారు. ప్రతీ మత్స్యకారుడు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం, బోటు లైసెన్స్ జిరాక్స్ కాపీలను సచివాలయంలో గానీ మత్స్యశాఖ సిబ్బందికి గానీ ఇచ్చి వేట నిషేధ భృతి కోసం పేర్లు నమోదు చేసుకోవాలని జేడీ చంద్రశేఖర్ రెడ్డి వివరించారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న నిందితుడిని శుక్రవారం రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు... ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ ఎస్ఐ కె. శాంతారాం, ఆర్పీఎఫ్ ఎస్ఐ ఓ మిస్త్రీ శుక్రవారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లాకు చెందిన అజిత్ బురిడి విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా విజయవాడకు గంజాయిని అక్రమంగా రవాణా చేయడాన్ని గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకుని, రూ. 35 వేలు విలువ గల 7 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

రుషికొండ భవంతులను మ్యూజియంగా మార్చాలి



వివరాలు వెల్లడిస్తున్న కొత్తపల్లి వెంకటరమణ

అల్లిపురం: రుషికొండలో గల భవంతులను మ్యూజియంగా మార్చాలని బుద్దిస్ట్ మాన్యుమెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విషయాన్ని ఇప్పటికే శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. విశాఖ జిల్లా బౌద్ధ చారిత్రక వారసత్వం కలిగిన ప్రాంతమని, జైనమతం ఆనవాళ్లు కూడా ఈ ప్రాంతంలో అనేకం ఉన్నాయన్నారు. తొట్లకొండ, బావికొండ, బొజ్జన్న కొండలతో పాటు శ్రీకాకుళం దాటి పొరుగు రాష్ట్రాల వరకు ఈ సంస్కృతి, సంప్రదాయాలు వ్యాప్తి చెంది ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకంగా రాష్ట్ర స్థాయి మ్యూజియం లేదన్నారు. ఈ ప్రాంతానికి చెందిన ఎంతో చారిత్రక సంపద హైదరాబాద్ మ్యూజియంలో ఉండిపోయిందన్నారు. చారిత్రక వారసత్వ సంపదను భద్రపరిచే నిలయంగా రుషికొండ ప్యాలెస్‌ను మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు అల్లు అప్పారావు, జె. రాంప్రభు, జేవీ భాస్కరరావు, బోనెల అప్పారావు, ఎన్.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి దేవస్థానానికి సింహాచలం ఏఈవో బదిలీ

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఏఈవోగా విధులు నిర్వర్తిస్తున్న కె.రాజేంద్రకుమార్‌ని నగరంలోని కనకమహాలక్ష్మి దేవస్థానానికి తిరిగి పంపిస్తూ రాష్ట్ర దేవదాయశాఖ ఇన్‌చార్జి కమిషనర్ కె.రామచంద్రమోహన్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. చందనోత్సవం ముందు ఈ వ్యవహారం జరగడం దేవస్థానంలో చర్చకు దారితీసింది. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఏఈవోగా విధులు నిర్వర్తిస్తున్న రాజేంద్రకుమార్‌ను మూడేళ్ల క్రితం జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా విజయవాడ దేవస్థానానికి బదిలీ చేశారు. కొన్నిరోజులకు మెడికల్ పర్పస్‌పై రాజేంద్రకుమార్ నగరంలోని కనకమహాలక్ష్మి దేవస్థానానికి డిప్యుటేషన్‌పై వచ్చారు. మళ్లీ కొన్ని రోజులకు రాజేంద్రకుమార్ వర్క్ ఎరేంజ్‌మెంట్ బేస్‌లో కనక మహాలక్ష్మి దేవస్థానం నుంచి సింహాచలం దేవస్థానానికి వచ్చారు. దీంతో రాజేంద్రకుమార్‌ని తిరిగి కనకమహాలక్ష్మీ దేవస్థానానికి ఏఈవోగా పంపిస్తూ ఇన్‌చార్జి కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా చందనోత్సవం ముందు ఈవ్యవహారం జరగడం దేవస్థానం వర్గాల్లో చర్చకు దారితీసింది. ఏఈవోగా విధులు నిర్వర్తిస్తున్న రాజేంద్రకుమార్ భూపరిరక్షణ విభాగం బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నారు. భూముల వ్యవహారంలో ఆయన పనితీరుతో అనుసరిస్తున్న వ్యవహారశైలి కూడా బదిలీకి ఒక కారణంగా చెప్పుకుంటున్నారు.

'కర్మయోగి' కోర్సుపై ఉపాధ్యాయులకు అవగాహన

మధురవాడ: కర్మయోగి ఆన్‌లైన్ కోర్సులను ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా పూర్తి చేయాలని చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం రవి సూచించారు. ఇంటిగ్రేటెడ్ గవర్నమెంట్ ఆన్‌లైన్ ట్రెనింగ్ పోర్టల్‌పై పాఠశాలలో ఉపాధ్యాయులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఉద్యోగుల విధి నిర్వహణలో నైపుణ్యాన్ని పెంచే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేసి, ఆన్‌లైన్‌లో శిక్షణనిస్తుందన్నారు. దీనిని అన్ని విభాగాల ప్రభుత్వ ఉద్యోగులు వినియోగించుకుని, తమ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవచ్చునన్నారు. ప్రతి ఉద్యోగి ఇందులో రిజిస్ట్రేషన్ చేయించుకుని, రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీ ద్వారా లాగిన్ అవ్వాలన్నారు. కర్మయోగి పేరున గల ఈ కోర్సులో లాగిన్ అయ్యే విధానాన్ని పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హోటల్‌లో ఉత్కంఠ

- అబ్బురపరిచిన అగ్నిమాపక శాఖ మాక్ డ్రిల్



స్కై లిఫ్ట్‌తో హోటల్ 5వ అంతస్తులో చిక్కుకున్న క్షతగాత్రులను రక్షిస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది



అగ్నిప్రమాదం జరిగినప్పుడు నీటిని స్ప్రింక్లింగ్ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అల్లిపురం: గురువారం ఉదయం 10.30 గంటలు.. సరస్వతి జంక్షన్, అల్లిపురం నుంచి ప్రజలు హఠాత్తుగా డాల్ఫిన్ హోటల్ వైపు పరుగులు తీశారు. అక్కడ ఏం జరుగుతుందో అర్థం కాక అందరూ ఆందోళనగా హోటల్‌లోకి చేరుకున్నారు. అక్కడ స్కై లిఫ్ట్‌లో కొందరు వ్యక్తులను రక్షిస్తుండటం చూసి ఉత్కంఠకు గురయ్యారు. అయితే అక్కడ అగ్నిమాపక శాఖ సిబ్బంది నిర్వహిస్తున్న మాక్‌డ్రిల్ అని తెలియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. జిల్లా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం డాల్ఫిన్ హోటల్‌లో అగ్నిమాపక సిబ్బంది ప్రత్యేక విన్యాసాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హోటల్ సిబ్బందికి అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలపై అవగాహన కల్పించారు. ఈ దృశ్యాలు హోటల్ సిబ్బంది, అతిథులను కొంత సేపు ఆందోళన కలిగించాయి. అనంతరం అగ్నిప్రమాదాల సమయంలో అనుసరించాల్సిన రక్షణ చర్యలను సిబ్బంది వివరించారు. బహుళ అంతస్తుల భవనాల్లో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు వాటర్ స్ప్రింక్లర్ల ద్వారా మంటలను ఎలా అదుపు చేయాలి? గ్యాస్ సిలిండర్‌కు మంటలు అంటుకుంటే వాటిని ఎలా ఆర్పివేయాలి? వంటి అంశాలను ప్రయోగాత్మకంగా నిర్వహించారు. ఏడీఎఫ్‌వో పి.సింహాచలం, సిబ్బంది పాల్గొన్నారు.